# "దున్నపోతుల మల్లయ్య పటేలు"

**మా** ఊల్లె మల్లయ్య పటేలని ఓ చిట్టపు కాపయినున్నడు. అయినెకు కొంచెమంతె వుసముంది. అంతకుముందు సంగతి తెలువదిగని నాకు తెలిసినప్పటికెల్లయినె దున్నపోతులతోనే ఎవుసం జేత్తండు. గవ్విటితోనెవుసం జేసెపటికెనే అయినెను దున్నపోతుల మల్లయ్య పటేలని పిలుత్తరు. అయితె అయినెంత కట్టపడెవుసం జేత్తున్నా ఎక్కడేసిన గొంగడక్కడేసినట్టె ఉంటది. అయినె నాకు బావ వరుసైతడు. అందరెడ్లతోందుంతె అయినె దున్నపోతులతో నెందుకు దున్నుతడో నాకు తెలువకపొయ్యేటిది. గట్లెందుకు జేత్తవు? ఎడ్ల గొంటేందని నేనోపారడిగిన. దానికయినె ఇంత పొడుగు దీర్గం దీసి సెప్పిండు.

"నాకెడ్లతోనెవుసం అచ్చిరాదు. మా నాయిన్న సచ్చిపెయింనంకోపారి ఎడ్ల గొనెవుసం బెట్టిన. యాడాదన్న తిరుగకముందే గారొండెడ్లు జచ్చినయి. ఇగ గప్పట్నుంచి దున్నపోతుల్తోనే ఎవుసం జేత్తన్న. మల్ల వీటిధర కొంత తక్కోన్నాయె. వీటితోని కొంచెమంత అచ్చత్తంది'2.

"అంటె కడుపునిండ బువ్వ దొరుకుతందా?"

"గట్లని గాదుగని ఇన్నన్ని అప్పునప్పులున్నా పొట్టకయితె సావులేకుంటెల్లుతంది. గివ్వయితె అగ్గోసగ్గోధరకచ్చె. ఎడ్లగొనన్నంటె కొద్ది పైసలు గావన్నా? కాదంటావా?" అన్నడయినె.

గా మాట నిజమే అన్న నేను. ఆయినె ఎన్నేండ్లయినా గని గట్లనే నడిపిత్తండు. ఓసారి కన్నాగురంల సదివెటప్పుడింటికచ్చిన. పొలంలకు నీల్లు సరిగ్గ పారుతన్నయో లేదో సూసిరమ్మని మా నాయిన్న తోలిండు. ఒడ్లపొంటి నడ్పుకుంట పొలం మొకాన నడుత్తన్న. మల్లయ్య పటేలాల్ల పొలంల దున్నుతండు. చిటపటమనెండ బాగ గొడ్తంది. దున్నపోతులెండకు మొసగొడ్తన్నయి.[90] నడువనని మొండికెత్తుతన్నయి. అవ్విట్ని రొండ్లపొంటి పొడిత్తె జల్లెడ తూట్లోలె వడ్డయి. అటిమీన జుబ్బర జుబ్బరీగలు ముసుర్తన్నయి. మడికట్టెనుక వత్తందని దవ్వదవ్వ దున్నన్నని అయినేగిర్త పడుతండు. కనివ్వి నడుత్తలెవ్వు.

నేనొడ్డుమీన నిల్సుండి సూత్తన్న.

"ఔ....ఔ.... నీ యవ్వ దున్నపోతులు పాడుగాను. ఔ..ఔ..." అని పొడుత్తండు. అవి ఒక్కడు గేసి మల్ల ఆగిపోతన్నయి.

"ఈట్ని మాదిగోడు దిన....ఔఔ" అని అనుకల్ల పొడ్సిండు.

ఒక్కసాలన్న నడ్వకముందే మల్లాగినయి. అండ్లోటి మలుసుకపన్నది. ముల్లుగట్టెతో ఎక్కడవడితక్కడ పొడ్సిండా దున్నపోతును. అది లేవలే. తోకదీసి పండ్లకింద వెట్టి కసుక్కున కొరికిండు. అది దన్‌మన్లేసింది.

"ఔ...ఔ....మిమ్ముల గద్దల్దిన" అని పొడుత్తండు.

నేం బోయి దగ్గెర్నిల్సున.

"ఏం బావ దున్నపోతుల్నడుత్తలేవా?" అన్న.

"ముత్తెమంతండెల్లుతయిపాయె. ఈటికి గత్తరత్తది. బురుదల బొర్లుతనంటయి. ఇవి పాడుగాను" అని వాట్ని నడిపిత్తండు.

"రొండ్లపొంటి రగుతం గారుతంది. నీకు పాపమనిపిత్తలేదా? నాగలిడువ సెయినివిగ. ఎండెల్లుతె అవి నడువయనెరికేనాయె" అన్న నేను.

"గివ్విట్ని జూత్తె నాకండ్లపొంటి నీల్లత్తయి. నోట్లెకు బుక్కెడన్నంబెట్టే గీ నోర్లేని పసురాలను గిట్ల పొడిసి సంపుటానికి నా పానమయిసిపోతంది. కనేం జెయ్యాలియ్యంపుడా? ఇదువరకే మడికట్టెనుకకు వెయింది. ఇంకింతెనుకకయితె పొట్టమందమన్న వడ్లు రాలయి. ఆరుగాలం జేసినాగని ఇగొ గీ బరిబద్ద బొక్కలే మిగుల్తన్నయి" అన్నడు నాగలాపి.

ఇంతల్నే ఆల్ల పొలం మొకాన పోవుకుంట ఎంకటయ్య షావుకారక్కడికచ్చాగిండు. దున్నపోతులం జూసిండు.

"అయ్యయ్యో! నీ కాపుకులం పాడుగాను. ఎంత కట్టెకోతకులమోయి.[91] దున్నపోతుల్తోటి దున్ని దున్ని నువ్వు గూడ దున్నపోతువయినట్టున్నవు గద! నీకటికె గుణం పాడుగాను. గివ్విటితోని దున్నుటానికి పాపమనిపిత్తలేదా?" అన్నడు చ్ చ్ అనుకుంట.

"పాపమనిపిత్తంది నిజమే కనేం జెయ్యాలె షావుకారు"

"నీ ఏడ్పు పాడుగాను. ఎప్పటికి మీద జెట్టక్కి[92] కూసున్నట్టే మాట్లాడ్తవ్. బలె కాపయినెవున్నవ్ తియ్యి.

"రెక్కల కట్టంతోని బతికెటోనిమీన జెట్టక్క గాకుంటె లచ్మిదేవి కూసుంటదా. ఇగొ గిట్లున్న

"నువ్వప్పుడు గంతేగని గా దున్నపోతులకు సాతగాకుంటయింది. పదేండ్లకెక్కో అయితందేమొ దున్నవట్టి. అవ్వి నడువయిగ. రొండు కొత్తాట్ని గొను.

"మా కొనన్నున్నదిగని పైసలేదున్నయి షావుకారి? గాలిధూళి గొట్టంగ పొంగ వచ్చిన పంట పెట్టువల్లకే ఐతంది. ఎట్లనో గీ ఫసలెల్లదీత్తె" పంట పండినంక మా కొంటిగ".

"నీ దరిద్రం పాడుగాను. గివ్వీటితోని గీపంట పండది. నేను పైసలు మా ఇత్తగని సోమారం జూలపెల్లంగట్లకు పొయ్యి కొనుక్కచ్చుకో పో......"

అడుగకంటినత్తున్నప్పుడు సంతోషం గనిపిచ్చిందయినె మొకంల నాకు.

"అయితె మానాయె గని మిత్తెంత?"

"మిత్తేంతేడిది? ఐదు లెక్కందీసుకో. లేకుంటె పంటమీన నూటికో బస్త వడ్లియ్యి. సరెనా ఇగ....."

"గంత మిత్తా షావుకారి. రొంటి లెక్కనియ్యిలేవు....?

"రొంటిలెక్కన గిప్పుడెవ్వలిత్తండ్రు. పిలిసి పిల్లనిత్తనంటె కులందక్కో అన్నడట నీ అసొంటోడు. గా పసురాల గోస సూడవుద్దిగాక నీకిత్తనన్న గని నా దగ్గర పైసలు మూల్గుతన్నయనుకుంటన్నవా? నీ ఇట్టముంటె నేం జెప్పిన మిత్తికి రేపచ్చి పైసలు గొంటవో. లేకుంటె లేదు" అనెల్లిపెయిండు.

"ఇగ జూడియ్యంపుడు! గిట్లుంటయి ఎవుసం జేసెటోల్ల బతుకులు. నాత్తిరి పగలు ఇరాముండది. అచ్చేదేముండది. అచ్చిన పంటంత ఇగొ గిసొంటోల్లకు గొలువాలె. ఇచ్చెటప్పుడు మా ఇత్తడు. అటెనుక అడ్డికడ్డి, మిత్తికి మిత్తి కట్టి ఉన్న దూడ్సుకపోతడు. ఈతాకిచ్చి తాటాకు దొబ్బుతరంటరు సూడు. గట్లుంటది గీ షావుకార్ల సంగతి. సందుల దొరికిచ్చుకొనేమొ సేసింద్రంటరు. గట్ల జేత్తరీల్లు. ఎంతవద్దన్నా మా కప్పులు దప్పయి. గీ ఫసలన్నెల్ల దీత్తామంటె దున్నపోతుల కొనందెల్లెటట్టు లేదు. ఇగ కొమటయినె దగ్గెరికి బాక్కి పోక తప్పది" అనుకుంట నాగలిడిసిండు మల్లయ్య పటేలు.

నేంబొయ్యి పొలానికి నీల్లు వెట్టచ్చిన. అటెనుక రొండేండ్లకు సేసినప్పు గట్టలేక పొలాన్ని షావుకారికే అప్పజెప్పిండని తెలుసుకోని బాదవడ్డ.

మల్లయ్య పటేలు ముసలోడయిండు. అయినా గా దున్నపోతుల్తోనే ఎవుసం జేత్తండు. నేనూరికి పెయినప్పుడల్ల కనిపిత్తె సాలు 'మంచిగున్నవా ఇయ్యంపుడా?" అని మాట్లాడిత్తడు. ఓపారోపారి దగ్గెరకచ్చి బిగ్గీత అలుముకుంటడు.

అయినె చనిపెయిండని తెల్సి నా హృదయం ద్రవించింది. నా అండ్ల నేనే మస్తుగేడ్సిన.

ఆ తరమోల్లు ఒక్కక్కలే రాలిపోతండ్రు. వాళ్ళతోపాటు ఆ ప్రేమలు, ఆ అప్యాయతలు కూడా రాలిపోతున్నట్టనిపిస్తుంది నాకు. గిదే నాకు బాద గల్గిస్తుంది.